# మతిపోయిన మనిషి

—పులిగడ్డ విశ్వనాథరావు

**"డియర్ సీతా,**

నే నిదివరకు రాసిన రెండు మూడ ఉత్తరాలకు నీ వద్ద నుంచి జవాబు లేదు. ఈ మధ్య మీ అన్నయ్య ఉత్తరం రాశాడు. దాన్ని చదివి నప్పటి నుండి నాకు మనశ్శాంతి లేకుండా పోయింది. ఏమిటి ఇది నిజమేనా? నాకు నువ్వు విడాకులు ఇవ్వ దలిచావా? సీతా! నాకుమాత్రం నమ్మకం కుదరడం లేదు. బహుశా మీ వాళ్ళు నిన్ను నిర్బంధిస్తున్నా రేమో! నిన్ను, రవిని విడిచి పెట్టి ఉండలేనని నీకు తెలుసు కదా. ఈ మూడు నెలలు నేను ఒక్కడినీ ఎలా బ్రతికానో నాకే తెలుసు. అలాంటిది నువ్వు, బాబు నా జీవితాంతం నాకు దూరమవుతారా? నా తప్పు ఏమిటి? నా అంతస్తు ఏమిటో, నా జీవిత భాగస్వామిగా నువ్వు ఎటువంటి కష్ట సుఖాలు అనుభవించ వలసి ఉంటుందో మన వివాహానికి ముందుగానే నీకు తెలుసు. నిజానికి ఆ వివరాలన్నీ మనం కూలంకషంగా చర్చించుకుని, తాపీగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చే రిజిస్టర్ మేరేజి చేసుకున్నాం. నాది చిన్న ఉద్యోగం కనుక నువ్వు కూడా ఉద్యోగం చేస్తూ మన సంసారానికి తోడ్పడతానని అన్నావు. అయితే అవన్నీ ప్రేమావేశంలో గుడ్డిగా అన్న మాటలేనా? నువ్వు అలా చెబితే ఇహ నేను జీవించ నక్కరలేదు.

అలాంటిది మీ అన్నయ్య నువ్వు విడాకులకోసం దరఖాస్తు పెడుతున్నావని రాశాడు. నాకు అటువంటి శిక్ష ఇవ్వకు, సీతా. జీవితం సినిమా కథ కాదు కాబట్టి నేను తీర హీరోలా అనతి కాలంలోనే టన్నుల కొద్దీ డబ్బు ఆర్జించి, కార్లు, బంగళాలు, నౌకర్లు సమకూర్చుకుని మీ అంతస్తుకు పెరగలేనని నీకు తెలుసు. అయినా మన ఆర్థిక స్థితిని గుడ్డిలో మెల్లగా మెరుగు పరుచుదామని ఈ మధ్య పార్ట్ టైము ఉద్యోగం చేస్తున్నాను. సాయంకాలం కూడా కష్టపడి ఇంటికి ఆలస్యంగా వచ్చినా నీకు, రవికి కొన్ని సదుపాయాలు కల్పించగలననే సంతృప్తి ఉంటుంది కదా.

నీకు నేను అప్పుడప్పుడు స్నేహితులతో డ్రింక్స్ తీసుకుంటానని కోపం ఉండవచ్చు. ఇదివరకు నీ కోరిక మేరకు ఎన్నడూ ఇంట్లో మద్యం సేవించలేదు. ఇప్పుడు నువ్వూ, పిల్లడూ నాకు దూరమయే పరిస్థితి ఏర్పడింది కాబట్టి ఇంటా, బయటా మరి డ్రింక్స్ తీసుకోనని నీ పై ఒట్టు వేసుకుంటున్నాను. నేను ఈ మాట తప్పితే తప్పక విడాకులు ఇచ్చే హక్కు చేకూరుతుంది—ప్రామిస్.

నీ చేత ఉద్యోగం చేయించడం నాకూ ఇష్టం లేదు. ఇంటిలో పనీ, ఆఫీసు పనీ చేయడం విసుగ్గా ఉంటుంది. ఇంట్లో దక్షత కూడా ఉండదు. అలా అని నువ్వు చేస్తానంటే నేను వద్దు అని అనలేదు. ఉద్యోగం చేయడం వలన మన ఆర్థిక పరిస్థితి బాగు పడుతుందని, ముఖ్య అవసరాలు తీరుతాయని అనుకుంటే నువ్వు ఉద్యోగం చేయడం పట్ల ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదు. నువ్వు రవి పుట్టే ముందు మానేసేదానివికదా. మరల ఉద్యోగంలో చేర వచ్చు. అది నీ ఇష్టం.

రవి రోజా, ప్రతి క్షణం తలపుకు వస్తూ ఉంటూ ఉంటాడు. అల్లరి చేస్తున్నాడా ఏమిటి? నీకు కోపం వస్తే వాణ్ణి బాదేస్తావు. చంటివాడు గదా! వాడు కొంటెతనం చేసినా నువ్వు క్షమాయించుకోవాలి.

ఈ ఉత్తరాన్ని టెలిగ్రామ్‌గా భావించి జవాబు రాయి.

ఇట్లు,
—ధర్మారావు."

సీత ఉత్తరం చదవడం పూర్తి చేయగానే సీత అమ్మ, "ధర్మారావు ఏమిటి రాశాడే?" అని ఉత్తరాన్ని తీసుకుంది.

"నువ్వుమాత్రం జవాబు ఇవ్వకు. మొసలి కన్నీరు కార్చి నీ మనసు కరిగించాలని వాడి ఉద్దేశం. వాడి బుట్టలో పడ్డావా నీ జీవితం, పిల్లడి జీవితం బండపాలే అని గుర్తుంచుకో" అంది సీత అమ్మ.

సీత మనసు ఉత్తరం చదివి కాస్త కలవరపడిన మాట వాస్తవమే. 'తాను నిజంగా ధర్మారావుకి అన్యాయం చేయడం లేదు కదా! రవి అంటే అతనికి ఎంత వాత్సల్యం! జవాబు రాస్తే మళ్ళీ ఆ నరకంలో పడాలి కదా. కటిక పేదరికం—సొసైటీలో 'నా భర్త ఫలానా' అని చెప్పి అందరితో సమానంగా తిరగలేదు. అమ్మ, నాన్న, అన్నయ్యకి దూర మవాలి. వాళ్ళు చెప్పినట్లు కొడుకు రవి జీవితం అక్కడ ఏం బాగుపడుతుంది? తనకోసం కాకపోయినా రవి భవిష్యత్తు కోసమయినా తాను ధర్మారావుకు దూరం కావలసిందే.'

ధర్మారావు, సీత ప్రేమ వివాహం చేసుకున్నారు. ధర్మారావుకి నాటకాల పిచ్చి ఉండేది. దానితో కాలేజి చదువు ప్రారంభంలోనే నమసిపోయింది. ధర్మారావుకు హీరో కావలసిన లక్షణాలు—అంటే ఎత్తు, రంగు, ముక్కు మొహం, క్రాపు—అన్నీ ఉండేవి కాబట్టి అతడు హీరో కావడానికి మద్రాస్ వెళ్ళాడు. ఒక ఏడాది స్టూడియోలు, ప్రొడ్యూసర్లు, డైరెక్టర్ల చుట్టూ ప్రదక్షిణాలు చేసి, జూనియర్ ఆర్టిస్టుగా పనిచేసి, చివరికి ప్రాణం విసిగి హైదరాబాద్‌లో చిన్న కంపెనీలో చిన్న ఉద్యోగిగా చేరాడు.

ధర్మారావుది, సీతది ఒకటే గ్రామం. బంధుత్వం కూడా ఉంది. చిన్నప్పుడు సీతని అతడికే ఇస్తారని అనుకునే వారు. ధర్మారావు నాన్న బడిపంతులు. కాస్త కలిగి ఉన్నవాడే. కాని ఆయన పోయేసరికి ఆస్తి అంతా కరిగిపోయింది. సీత నాన్న పట్టణంలో ఒక డాక్టరుగారి వద్ద కాంపౌండర్‌గా ఉండేవాడు. పట్టణానికి రోజూ వెళుతూ వస్తూ ఉండేవాడు. పేద కుటుంబీకుడే కాని క్రమేణా పల్లెటూరిలోనే ప్రాక్టీసు పెట్టి, రెండుచేతులా ఆర్జించి మోతుబరి అయ్యాడు. పెంకుటింటి రూపు మార్చి బంగళాగా చేశాడు. సొంత జట్కా, భూములు కొన్నాడు. సీతను పట్టణానికి పంపించి బి. ఎ. చేయించాడు.

ధర్మారావు నాన్న కూతుళ్ళ పెళ్ళికి భూములు అమ్మేశాడు. ధర్మారావు అప్పుడప్పుడు గ్రామం వస్తూ ఉండేవాడు. సీతకు ధర్మారావునే చేసుకోవాలని ఉండేది. ఆమె తలిదండ్రులు "వాడు నిన్నేమి పోషిస్తాడే. వాడి అందం నీకు భోగ భాగ్యాలు ఇవ్వవు కదా. కట్నం ఇచ్చి ఇంజనీయరునో, డాక్టరునో లేక పెద్దఉద్యోగినో చేసుకునే స్తోమత మనకుంది" అనేవారు.

సీత పట్టణంలో చదువుతున్నప్పుడు ధర్మారావు ఆమెను కలుసుకుంటూ ఉండేవాడు. ధర్మారావు చాలా తమాషాగా మాట్లాడేవాడు. అతడి అందం, తమాషా మాటలు ఆమెను మరింత ఆకర్షించి ఆమె మనసును అతడి మనసుకు ముడివేశాయి.

'ధర్మారావు లేందే నా జీవితం ఖాళీగా ఉన్నట్లు అనిపిస్తూంది. అతడికి పెద్ద చదువు లేకపోతేనేం. పెద్ద ఉద్యోగం లేకపోతేనేం. నేను చదువుకుంటు న్నాను కదా. నేనూ ఉద్యోగం చేస్తాను. మా వైవాహిక జీవితం సాఫీగా సాగేలా చేస్తాను' అని నిశ్చయించుకుంది.

సీత బియ్యే పాసయ్యాక అమ్మ, నాన్న చాలా మంది పెళ్ళి కొడుకులను చూపించారు. వాళ్ళంతా ఇంజనీర్లు, పెద్ద ఉద్యోగులు, ఆస్తులు ఉన్న వారూను. కాని ఆమెమాత్రం వాళ్ళ అందచందాలను ధర్మారావుతో పోల్చేది. ధర్మారావెక్కడ వీళ్ళెక్కడ. వాళ్ళను త్రోసి పుచ్చేది.

సీత ఉద్యోగం చేస్తానంది. అవసరం లేదే అన్నారు తన వాళ్ళు. వూరికే కూర్చుని ఏం చేయాలని

పట్టణంలో ఉద్యోగంలో చేరింది. ఉద్యోగంతో ఆర్థిక బలం, ధైర్యం చేకూర్చాయి. ఈ సారి ధర్మారావు పట్టణం వచ్చినప్పుడు పెళ్ళి ప్రసక్తి తెచ్చింది. ధర్మారావు తన ఉద్యోగం, ఆర్థిక పరిస్థితి వివరించి ''నువ్వు నాతో సుఖంగా ఉండగలవా?'' అని ప్రశ్నించాడు.

''పెళ్ళయాక నీతో హైదరాబాదులో ఉంటూ ఉద్యోగం చేస్తాను'' అంది.

''అయినా నువ్వు బాగా ఆలోచించు. మీ అమ్మా, నాన్నా కోపం కొద్దీ మనకు దూరం కావచ్చు. నేను రెండు నెలలలో మళ్ళీ ఈ వూరు వస్తున్నాను. అప్పటికి అన్నీ ఆలోచించుకుని నిశ్చయించుకో. నువ్వు సరేనంటే రిజిస్ట్రరు మేరేజి చేసుకుని హైదరాబాదు వెళ్ళిపోదాం'' అన్నాడు.

రెండు నెలలకు ధర్మారావు వచ్చాడు. తాను అతడిని వివాహ మాడడానికి నిశ్చయించుకున్నట్టు సీత ధర్మారావుకు చెప్పింది. తరవాత రిజిస్టర్ మేరేజి చేసుకున్నారు. వూటీకి హనీమూన్ వెళుతూ సీత అమ్మకి నాన్నకి ఉత్తరం రాసి పడేసింది. ఆమె ఉత్తరం ఆటంబాంబులా సీత తలిదండ్రులనూ, అన్నదమ్ములనూ కలవర పరిచింది. కాని ఏం చేయగలరు. తమ కోపాన్ని, ఆక్రోశాన్ని ప్రకటించలేక ఆమె పట్ల ఉదాసీనం వహించినట్లు నటించసాగారు. కాని ఆ నటన అట్టే కాలం సాగలేదు. సీత తల్లి ప్రోద్బలం మీద సీత తండ్రి హైదరాబాద్ వెళ్ళి బంధువుల ఇంట్లో ఉంటూ సీతకు కబురు పంపాడు. సీత వచ్చింది.

''మేము ఎంత చెప్పినా వినక నీ ఇష్టానుసారం పెళ్ళి చేసుకున్నావు. ఎలా గడుస్తూంది అమ్మా?''


''నేను ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను.''

''అప్పటికైనా నీ బతుకు బాగు పడుతుందా? పిల్లలు పుట్టాక ఏమి చేస్తావు?''

''ఏదోలా బతుకుతాం'' అంది ముభావంగా.

''ఇప్పటికైనా మించి పోయింది లేదు. నాతో వచ్చెయ్. కీకు విడాకులు ఇప్పించి మంచి సంబంధం చేస్తాను'' అన్నాడు సీత నాన్న. సీత మవునంగా అక్కడనుంచి వచ్చేసింది. సీత నాన్న లాభం లేదని తిరిగి వచ్చేశాడు.

సీతకు ఏదో ఉద్యోగం దొరికింది. సీత తలిదండ్రులుకూడా నెల నెలా డబ్బు పంపడం ప్రారంభించారు. ఈ డబ్బు తిరిగి పంపివేద్దామని సీత అనుకుంది. కాని వాళ్ళు కోరి పంపినప్పుడు



తిరక్కొట్టేయడం సబబుగా ఉండదని సర్దుకుంది. డబ్బు అవసరమనూడా. అయినా డబ్బు పంపవద్దని బంధువుల ద్వారా కబురు పంపింది.

సీత నెల తప్పింది. ఈ కబురు తెలియగానే సీత తల్లి ఉత్తరం రాసింది. ఉద్యోగం మాని లేదా జీతం నష్టం మీదైనా సెలవు పెట్టి ఇంటికి వచ్చి అక్కడే పురుడు పోసుకొమ్మని. వస్తే ధర్మారావుకి ఇబ్బందిగా ఉంటుందని సాకు చెప్పి ఇక్కడే పురుడు పోసుకుంటానంది. పురిటికి సీత తల్లి వచ్చింది. ఒంటి గది కాపరం సీత అంట్లు తోముకోవడం చూసి లోలోన బాధ పడింది. కాని ఏమీ అనలేదు.

ఏమీ అనకపోయినా వాళ్ళ కాపురం పట్ల ఆమె హేయభావం ధర్మారావు పట్ల ఆమె క్రోధం దాగలేకపోయాయి. ఆమె అప్పుడప్పుడు సీతకు ఇంటికి వచ్చేయ్ అని సూచిస్తూండేదికూడా. ఎలాగో అలాగ పురుడు పోసి రెండు నెలలు ఉండి వెళ్ళింది సీత అమ్మ. పోతూ సీత ఒక్కర్తె ఎలాచేసుకుంటుందో అని పని మనిషిని పెట్టింది.

సీత ఉద్యోగం మానివేయవలసి వచ్చింది. సీత నాన్న పంపించే డబ్బుతో కాలక్షేపం చేస్తూంది. లేకపోతే పిల్లాడికి మంచి పోషణ ఉండకపోను. ధర్మారావు జీతం అంతంత మాత్రమే. ధర్మారావు మద్యపానం చేయడం సీతకు బొత్తిగా ఇష్టం లేదు. సీత విసుక్కొగా ధర్మారావు బయటే తాగి రావడం ప్రారంభించాడు. అలా అని అతడికి రోజూ తాగే అలవాటు లేదు. ఒక రోజు సీత విసుక్కుంది.

"బాబుకి ఒంట్లో బాగులేదు. కాని మీకు అది కావాలా ఏమిటి? తాగడం అంత అవసరమా? వేళకి వస్తే బాబుని డాక్టరు వద్దకు తీసుకు వెళదామనుకున్నాను."

ధర్మారావుకి చిర్రుమంది. "ఇంతవరకు నే నేం తాగుతూ కూర్చోలేదు. వోవర్ టైమ్స్ చేసి, వస్తూ వస్తూ మా కొలీగ్ పార్టీ ఇస్తే వెళ్ళాను. నేను పేదవాణ్ణి అనేగా చులకన. మీ అమ్మ నాన్న డబ్బు పంపుతారనేగా నీ ధైర్యం, ఆ సొమ్ము పుచ్చుకోవద్దని నీకు చెప్పలేదా?"

"అది పుచ్చుకోకపోతే మనం పస్తు ఉండవలసిందే. బాబుకి పాలుకూడా ఉండవు."

ధర్మారావు కోపం మరింత పెరిగింది. పెద్ద వాగ్యుద్ధం జరిగింది. ఇలా రెండు మూడు సార్లు అయేసరికి అమ్మా, నాన్నా అన్నది నిజమే అనిపించ సాగింది ఆమెకు. కేవలం అందం, ప్రేమ వలన జీవిత గడవదు కదా అనే భావం ఆమెలో చోటు చేసుకోసాగింది.

'ఈ బతుకూ బతుకేనా, ఒక సోషల్ లైఫ్ కూడా లేదే' అని అనుకోసాగింది ఆమె. ఒక రోజు కరుణ కనపడింది. తనతో చదువుకున్నది. కారు ఆపి పలకరించింది. మొగుడు పెద్ద లాయరుట. "మీ ఆయన ఏం చేస్తున్నారు?" అని అడిగింది కరుణ. ఫలానా కంపెనీ అని చెబితే పూర్తా పేరూ లేని కంపెనీ అది. ఉద్యోగమా అంటే అదీ క్లర్కు ఉద్యోగం. ఏదో చెప్పేసింది. తన ఇల్లు దగ్గరగా ఉన్నా కరుణని ఆహ్వానించ లేదు. ఒక గది ఇల్లు. కుర్చీకూడా లేదు. పిలవడానికే సిగ్గు అనిపించింది. కరుణ తన ఇంటి అడ్రస్ ఇచ్చి తప్పక రమ్మంది.

ఉన్నట్టుండి సీత నాన్నగారికి గుండె పోటు వచ్చిందని టెలిగ్రామ్ వచ్చింది. సీత, ధర్మారావు పుట్టింటికి వెళ్ళక తప్పలేదు. సీతను అంతా ఆప్యాయంగా పలకరించారు. ఆయన కొన్నాళ్ళకు కోలుకున్నాడు. సీత అమ్మ ఆమెకూ, బాబుకూ ఎన్నో వస్తువులు కొని పెట్టింది. ధర్మారావు రెండు రోజులు ఉండి తిరిగి హైదరాబాదు వెళ్ళిపోయాడు. సెలవు ఉన్నా అతడికి అక్కడ ఉండడం మనస్కరించ లేదు. ఎవరూ పలకరించే వారు కారు. అదో మోస్తరుగా ప్రవర్తించే వారు. హైదరాబాదులో సీత పురిటికి అత్తగారు ధర్మారావు ఇంటిలో ఉన్నా ఎన్నడూ ధర్మారావుతో మనసారా మాట్లాడి ఎరగదు. అత్తవారు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం చూసి ధర్మారావుకే కాదు, ఎవరికైనా బాధగా ఉంటుంది. వెళుతున్నానని చెప్పినా సీతకూడా ఉండమనలేదు. సీత కాస్త దూరమైనట్లు ధర్మారావుకు అనిపించింది.

సీత అమ్మ, నాన్నగారు సీతకు రోజూ నూరి పోయడం మొదలెట్టారు. "నీ బతుకు మా తరవాత ఏమవుతుందో వూహించుకో. నీకు విడాకులు ఇప్పిస్తాం. మాతో హాయిగా ఉండు. నీకు ఇష్టమై


ఎల్. కె. ఎస్. బంగారం
చేతిలో రొక్కమే!


గ్యారంటీ గల
22 కారట్ల బంగారు ఆభరణాల కొరకు

LKS

L.K.S Jewellers
Gold Jewels & Diamonds
138, N S C BOSE ROAD MADRAS-1

సందర్శించండి :
ఎల్. కె. ఎస్. జ్యువలర్స్,
138 ఎన్. ఎస్. సి. బోస్ రోడ్డు,
మద్రాసు-600 001.




నప్పుడు మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాం. నీ వయస్సెంతని. ఒక లక్ష రూపాయలు పారేస్తే మంచి సంబంధం వస్తుంది. కిందటేడు డాక్టర్ రామయ్యగారి అబ్బాయి చలానికిపెళ్ళయిందిగ అతడి భార్య కారు ఏక్సిడెంట్‌లో పోయిందిట. మీ అన్నయ్య అతడ్ని కదిపితే సుముఖంగానే ఉన్నట్టు తెలిసింది. మన కంటె డబ్బున్న వాళ్ళు. చలం లీగల్ ప్రాక్టీసుకూడా ఎంతో బాగా సాగుతూందిట'' అనేది అమ్మ.

అమ్మ తన బతుకు తలుచుకుని ఎప్పుడూ కంట తడి పెట్టుకుంటూంది. ఇక అన్న విషయం చెప్ప నవసరం లేదు. ధర్మారావు ప్రసు రాగానే ఆలిన్ని తిట్ట నారంభించేవాడు. సీత వచ్చి మూడు నెల లయింది.

అసలే సీతకు తన కాపురం పట్ల విసుగ్గా ఉంది పుట్టింట్లో అంతా ఆమెను పురి గొల్పి ధర్మా రావంటే విరక్తి కలిగేలా చేశారు. పుట్టింట్లో తనకీ, బాబుకీ జరిగినట్టు హైదరాబాదులో జరుగు తుందా? వద్దు బాబూ, ఆ నరకం వద్దు అనుకో నారంభించింది సీత.

ధర్మారావు మళ్ళీ ఉత్తరం రాశాడు.

సీత,

నువ్వు ఇప్పటికీ జవాబు రాయలేదు. మీ వాళ్ళు నిన్ను నిర్బంధిస్తున్నారని నా నమ్మకం. క్రిందటిసారి వచ్చినప్పుడు మీ వాళ్ళు నన్ను కించపరిచారు కాబట్టి నాకు రావడం ఇష్టం లేదు. కాని నాకు ఇప్పుడసే పగలు మనశ్శాంతి, రాత్రి నిద్ర లేవు కాబట్టి నాకు ఎంత అవమానం జరగబోయినా అక్కడకు రాదలిచాను. నీతో మాట్లాడాలి.

నువ్వు, బాబు క్షేమమని తలుస్తాను.

ఇట్లు,
ధర్మారావు.''

సీత జవాబు రాయలేదు. సీత నాన్నగారు, ''ధర్మారావు వస్తాడట. రానీ. అమ్మా, సీతా! నువ్వు నిబ్బరంగా ఉండు. విడాకులు ఇస్తామని స్పష్టంగా చెబుదాం. వాడి మాటలు విని మెత్త బడ్డావా నీకు మళ్ళీ ఆ దరిద్రపు బతుకు తప్పదు. నాకూ, మీ అమ్మకూ మాత్రం నీ కాపురం చెడ గొట్టడం ఏమైనా సరదానా లేక! మేము నీకు శత్రువులమా. నీ కుంటుపడిన బతుకును తీర్చి దిద్దుదామని మా ఉద్దేశం. డాక్టరు రామయ్యగారి అబ్బాయి చలం నిన్ను చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడట. అతడి భార్య పోయినట్టు నీకు తెలుసుగా! అన్నయ్యతోటే ప్రాక్టీసు చేస్తున్నాడు. బ్రహ్మాం డంగా సాగుతోంది అతడి ప్రాక్టీసు. దానికితోడు బోలెడంత ఆస్తి ఉంది. కారు, బంగళాలు అన్నీ ఉన్నాయి. కాస్త ఓపిక పట్టు'' అన్నారు.

సీత ఏమీ మాట్లాడలేదు. తన జీవిత పగ్గాన్ని తలిదండ్రులకు అప్పజెప్పి మనసు రాయి చేసుకుంది. ధర్మారావు వచ్చాడు. నాన్న సీతని, బాబుని అతడి కంటబడకుండా ముందుగానే పట్టణానికి పంపేశారు.

ధర్మారావు వచ్చాడు. భోజనం పెట్టి, నింపాదిగా కూర్చోబెట్టి సీత అమ్మా, నాన్నా ''సీత విడాకులు ఇవ్వదలచింది'' అని స్పష్టంగా చెప్పేశారు. సీత ఎక్కడికి వెళ్ళింది అని అడిగితే, ''నిన్ను కలుసుకోవడం దానికి ఇష్టం లేదు. అది పట్టణం వెళ్ళింది. మేమేం దాన్ని బలవంతం చేయడం లేదు. అదే నీకు విడాకులు ఇవ్వడానికి నిర్ణయించుకొంది. దాన్ని మరిచిపో. దాన్ని కలుసుకుంటే నీకు మరింత బాధగా ఉంటుంది. కుండ పగిలినా, మనసు పగిలినా అతకవు'' అని బోధించారు.

ధర్మారావు చిన్నపిల్లవాడిలా ఏడిచాడు. బాబుని చూడాలని ఉందన్నాడు. ఆ రాత్రే ధర్మారావు వెళ్ళిపోయాడు. సీత తిరిగి గ్రామానికి వచ్చేసింది. మరో వారానికి చెప్పాచేయకుండా ధర్మారావు ఊడి పడ్డాడు. ''నువ్వు సీతతో మాట్లాడడానికి వీలులేదు'' అని అన్నయ్య చెప్పినా, ధర్మారావు మీరేం చేసినా సీతతో మాట్లాడితేనే కాని వెళ్ళనన్నాడు. ఈ సారి సీత ధర్మారావుని తప్పనిసరిగా కలియవలసి వచ్చింది. ''విడాకుల విషయం నువ్వు స్పష్టంగా చెప్పెయ్యి, సీతా. మరేమీ వినిపించుకోకు, మాట్లాడకు. దాంతో వాడి పీడ విరగడవుతుంది'' అని అన్నయ్య గట్టిగా చెప్పి సీతని డ్రాయింగ్ రూంలోకి పంపాడు.

బాబు ధర్మారావు ఒడిలో ఉన్నాడు. ధర్మారావు చాక్లెట్ డబ్బా వాడి చేతిలో పెట్టి గారాబంగా ముద్దు పెట్టుకున్నాడు. ధర్మారావు సుస్తీపడ్డ మనిషిలా ఉన్నాడు. మొహంలో మునుపటి కాంతి లేదు. సీతను చూడగానే అతడి మొహం దీపంలా వెలిగింది.

''ఏం సీతా, నన్ను మరిచిపోయావా?'' అని చిరునవ్వుతో అడిగాడు.

ధర్మారావు దీనావస్థ చూసి సీతకి జాలివేసింది. 'తాను విడాకులు ఇస్తే ధర్మారావు పిచ్చెత్తిపోవడమో ఆత్మహత్య చేసుకోవడమో ఖాయం. తననీ, బాబునీ అతడు అంతలా ప్రేమిస్తాడు! ధర్మారావు పేదవాడే. అతడి భార్య తాను జీవితాంతం పేదరికం అనుభవించ వలసిందే. ఆ విషయం తెలిసే తను అతడ్ని వివాహ మాడింది. ఐనా అతడు తనని ఎంతలా ప్రేమిస్తాడు. తాను రెండో పెళ్ళి చేసుకుంటే ఆ కొత్త భర్త కూడా అంతలా ప్రేమిస్తాడని నమ్మక మేమిటి? అతడు తనను, బాబుని అలా ప్రేమించకపోతే ఆ ఐశ్వర్యం వృథాయే కదా. ఇంతకీ తాను వేరయితే వేరయింది కాని, బాబుకి తండ్రి ప్రేమాభిమానాలు లేకుండా చేసే హక్కు తన కెక్కడ ఉంది

సీత నిశ్చయించుకుంది. తాను దారిద్ర్యం అనుభ విస్తుంది. విసుక్కుంటుంది. అప్పుడప్పుడు ధర్మా రావుతో వాగ్వాదాలకు దిగుతుంది. ఏ భార్యాభర్తల మధ్య వాగ్యుద్ధాలు జరగవు! కాని ధర్మారావు నుండి వేరవదు. పుట్టింటి వాళ్ళకు ధర్మారావు అంటే పడదు కాబట్టి వాళ్ళు తనను అతనికి దూరం చేయ డానికి సాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఆమె కళ్ళలో నీరు పూరింది, గొంతు పూడుకుపోయింది.

'ఏమండీ ఆలా అయిపోయారు. రేపు మీతోనే నేనూ, బాబు వచ్చేస్తాం'' అని అనగలిగింది సీత.

అన్నయ్య లోనుంచి వచ్చి ''ఆదేమిటే సీతా, నీకు మతి పోయిందా?'' అని అరిచాడు.

''అవును, నాకు మతి పోవడమే మంచిది'' అని అంది సీత దృఢ నిశ్చయంతో. ★